ప్రజాశక్తి

శుక్రవారం 13 డిసెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విద్యుత్ భారాలతో విలవిల

◆ గగ్గోలు పెడుతున్న ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, చిరు వ్యాపారులు

◆ అమాంతంగా పెరిగిపోయిన కరెంట్ బిల్లులు


ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వ్యాపారాలు సరిగా సాగక ఆందోళన చెందుతున్న చిరు వ్యాపారులు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులపై విద్యుత్ పిడుగు పడింది. తాజాగా వచ్చిన విద్యుత్ ఛార్జీల బిల్లులను చూసి వారంతా గుండెలు పట్టుకుంటున్నారు. రాష్ట్రంలో అధికారం మారిన తర్వాత తమ బతుకులు బాగుపడతాయని, ఆర్థికంగా స్థిరపడొచ్చని భావించిన చిరు వ్యాపారులంతా నేడు కరెంట్ బిల్లులను చూసి లబోదిబోమంటున్నారు. పగలు, రాత్రుళ్లు ప్రింటింగ్ పని చేసినా ఇంతేసి బిల్లులు గతంలో ఎప్పుడూ రాలేదని, ఇవే భారాలను ప్రభుత్వం కొనసాగిస్తే తమ వ్యాపారాలను మూతపెట్టుకోవాల్సిందేనని విశాఖ నగరంలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేపర్ రేట్లు పెరిగిపోయి వ్యాపారం పూర్తిగా దెబ్బతినడంతో ఇప్పటికే నెలలో 20 రోజుల పాటు తమకు ప్రింటింగ్ ఆర్డర్లు ఉన్నా గిట్టుబాటుగాక



ప్రింటింగ్ ప్రెస్ వద్ద పైడిరాజు

చేయలేకపోతున్నామని నగరంలోని దొండపర్తి ఏరియా 27వ వార్డుకు చెందిన శ్రీనగర్ (జానకీరామ వీధి)లోగల స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ వారు ఆవేదనకు గురౌతున్నారు. ఆ ఏరియాలో 50 వరకూ ప్రింటింగ్ ప్రెస్‌లున్నాయి. ఇక్కడ ఎవరిని కదిపినా డిసెంబరు మొదట వారంలో తమకొచ్చిన కరెంట్ బిల్లులను చూసి



పైడిరాజుకు నవంబర్‌కు వచ్చిన బిల్లు

గుండెలు పట్టుకున్న పరిస్థితులే నెలకొన్నాయని శ్రీవాగ్దేవి ప్రింటర్స్ యజమాని పైడిరాజు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

బాదుడు మామూలుగా లేదు..!

ఇలానే విద్యుత్ ఛార్జీల బాదుడు కొనసాగితే నగరంలో ఏ ఒక్క చిరు వ్యాపారీ, ప్రింటింగ్ ప్రెస్ యజమానీ మనగలేదని పలువురు వాపోతున్నారు. సర్వీస్ నెంబరు 11231డి033172270కి సంబంధించి అక్టోబర్‌లో రూ.647 కరెంటు బిల్లు వచ్చింది. ఎఫ్‌పిపిసిఎ 2 ఛార్జ్ కింద రూ.47 పడింది. ఇదే సర్వీసు నెంబరుకు నవంబర్‌లో రూ.1191 బిల్లు వచ్చింది. దీన్ని ఈ నెల 18లోగా చెల్లించాల్సి ఉంది. ఈ సర్వీసు కనెక్షన్‌కు నవంబర్‌లో సర్ ఛార్జ్ కింద రూ.150, ఇడి రూ.107, ఎనర్జీ ఛార్జీల కింద రూ.715 బాదారు. బిల్లును పట్టుకుని సదరు చిరు వ్యాపారి కొవ్వూరి పైడిరాజు లబోదిబోమంటున్నాడు. అక్టోబర్ బిల్లులో మిగతా 2లో..

మొండి బకాయి రూ.4822 కోట్లు

◆ వసూళ్లపై దృష్టి కేంద్రీకరించని ఇపిడిసిఎల్

◆ పెరుగుతున్న ప్రభుత్వ కార్యాలయాల మొత్తాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విద్యుత్ వినియోగదారులపై భారం వేసి ఆదాయం రాబట్టుకోవడంపై ప్రదర్శిస్తున్న ఉత్సాహాన్ని బకాయిలు రాబట్టుకోవడంపై ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) చూపడంలేదు. గతంలో వినియోగించిన విద్యుత్‌పై ఇప్పుడు సర్దుబాటు ఛార్జీల కింద వసూలు చేస్తున్న ఇపిడిసిఎల్... వినియోగ విద్యుత్‌కు బిల్లు చెల్లించని వారి జోలికి వెళ్లడంలేదు. వాడిన విద్యుత్‌కు బిల్లు చెల్లించని వివిధ కేటగిరీలకు సంబంధించి 35,839 సర్వీసుల నుంచి ఈ ఏడాది అక్టోబర్ 31 నాటికి రూ.4,822 కోట్లు రావాల్సివుంది. ఇపిడిసిఎల్ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఎల్‌టిలో ఐదు కేటగిరీల్లోని 34,228 సర్వీసుల నుంచి రూ.1747 కోట్లు, హెచ్‌టిలో 1611 సర్వీసుల నుంచి రూ.3,075 కోట్లు వెరసి రూ.4,822 కోట్లు బకాయి రావాల్సివుంది. రూ.50 వేలలోపు బకాయి మరో రూ.500 కోట్లు ఉంటుందని అంచనా.

ఇపిడిసిఎల్ పరిధిలోని మొండి బకాయిల్లో రూ.1491 కోట్లు ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి రావాల్సివుంది.



ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం (ఫైల్ ఫొటో)

కార్యాలయాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో కరెంట్ బిల్లు చెల్లించక, బకాయిలు చాంతాడులా పెరుగుతున్నాయి. హెచ్‌టిలోని మూడో కేటగిరీలోనున్న పరిశ్రమల నుంచి అత్యధికంగా రూ.1689 కోట్లు రావాల్సివున్నా, వసూలుపై తగినంత దృష్టి పెట్టడంలేదు. కేటగిరీ మిగతా 2లో..

ఆర్గానిక్ మేళా ప్రారంభం

▶ వార్త 2లో..

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

▶ వార్త 8లో..

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

▶ వార్త 8లో..

ఎన్ఎడి ఉద్యోగుల ఉద్యమానికి..

కార్మిక సంఘాల సంఘీభావం

ప్రజాశక్తి - గోపాలపట్నం : ఎన్ఎడిలో 36 మందిపై అక్రమ సస్పెన్షన్లు విధించడం, ఆరుగురిపై పోలీసు కేసులు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కొద్ది రోజులుగా సాగుతున్న పోరాటం గురువారానికి తీవ్రమైంది. విక్టమైజేషన్‌కి వ్యతిరేకంగా ఎన్ఎడి గేటు వద్ద బహిరంగ సభ జరిగింది. కార్మిక సంఘాల నాయకులు ఈ పోరాటానికి సంఘీభావం తెలిపారు. వారం రోజులుగా విశాఖ రక్షణ రంగంలో విక్టమేజేషన్ వ్యతిరేక పోరాటం వివిధ రూపాల్లో సాగిందని సభకు అధ్యక్షత వహించిన డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ రెడ్డి వెంకటరావు తెలిపారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ ఎన్ఎడి కార్మిక ఉద్యమానికి విశాఖ కార్మిక ఉద్యమం అండగా ఉంటుందని, శ్రామిక



సంఘీభావం తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

మహిళలు, మహిళా సంఘాల అండను కూడగడతామని అన్నారు. సిజిఎం తమ తప్పును ఒప్పుకొని సస్పెన్షన్లను వెంటనే రద్దు చేయాలని, కేసులు ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో జరగబోయే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం మాట్లాడుతూ మిగతా 2లో..

ముత్తంశెట్టి తోవలో మరికొందరు ?

వైసిపిని వీడే ఆలోచనలో తర్జనభర్జనలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైసిపిపై మాజీ మంత్రి, భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు గురువారం రాజీనామా అస్త్రాన్ని సంధించిన క్రమంలో ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు అదే దారిలో వెళ్లనున్నారా ? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. 2024 ఎన్నికలో ఘోరంగా ఓటమి పాలైన వైసిపితో కలిసి సాగడం వల్ల ఏ మాత్రమూ లాభం లేదనుకునే ముత్తంశెట్టిలాంటి వారంతా ఒక వరసలోకి వస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో పార్టీ ఓటమి చెంది, తామూ పరాజయం పాలైన నేపథ్యంలో ఆ పార్టీ మాజీ ఎంఎల్‌ఎలు, మాజీ ఎంపీ సైతం పూర్తిస్థాయి నిస్తేజంలో కూరుకుపోయారు. వ్యాపారాలు చూసుకుంటున్నామన్న నెపంతో విశాఖ నగరంలో జరిగే పార్టీ కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు డుమ్మా కొడుతూ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు.

ఎవరి దారి ఎటువైపు..?

విశాఖపట్నం ఎంపీగా గత ఎన్నికల్లో గెలిచిన ఎంవివి.సత్యనారాయణ పార్టీ కార్యక్రమాలకు దూరమైపోయారు. హైదరాబాద్, బెంగళూరుల్లో వ్యాపార కార్యకలాపాలతో బిజీ బిజీ అయిపోయారు. విశాఖలో నివాసం ఉన్నా ఎక్కువ సమయం బయటే గడుపుతున్నారు. విశాఖ పశ్చిమం నుంచి ఎంఎల్‌ఎగా పోటీచేసి ఓటమి చెందిన ఆడారి ఆనంద్ కుమార్ ఎన్నికల ఫలితాలు వచ్చిన నుంచీ పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. ఇప్పటికే విశాఖ డెయిరీ విషయంలో తీవ్ర స్థాయి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయన బిజెపిలో చేరి తన వ్యాపారాలను నిలబెట్టుకుంటారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఉత్తరంలో ఓటమి చెందిన వైసిపి నాయకుడు కెకె.రాజు పలు కార్యక్రమాలతో గతంలో జనంలో ఉండేవారన్న పేరున్నప్పటికీ తాజా ఓటమితో కాస్త నెమ్మదించారు. దక్షిణంలో వాసుపల్లి గణేష్ కుమార్ మాత్రమే ఓటమి చెందినా



రాజీనామా అనంతరం మాట్లాడుతున్న ముత్తంశెట్టి

నియోజకవర్గంలో తనదైన శైలిలో ప్రజలకు చేరువయ్యేందుకే పక్కా ప్రణాళికతో సాగుతున్నారు. వైసిపికి ఉత్తరాంధ్రలో పెద్దదిక్కుగా చెప్పుకునే బొత్స సత్యనారాయణకు ఎంఎల్‌సి పదవి ఉండడంతో ఆయన విశాఖపై కొంత ఫోకస్ పెడుతున్నా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విద్యుత్ భారాలతో విలవిల

68 యూనిట్లకు రూ.9.50పైసలు యూనిట్‌పై పడగా నవంబర్ బిల్లులో 107 యూనిట్లకుగానూ యూనిట్‌పై రూ.11 పడింది. దీంతో రూ.1191కు ఒకేసారి బిల్లు వెళ్లిపోయింది. దీంతో ఆ వ్యాపారి తీవ్ర ఆవేదనకు గురౌతున్నాడు. నెలలో 10 రోజులు కూడా పని ఉండడం లేదని, నెలకు తన షాపునకు రూ.7500 అద్దె చెల్లించాల్సి ఉందని, ఏళ్లతరబడి అలవాటైపోయిన పని అయినందున మరో పనికి వెళ్లలేకపోతున్నానంటూ తీవ్రస్థాయిలో ఆయన ఆవేదనకు గురయ్యాడు. బిల్లులు అమాంతంగా పెరిగిపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచడం లేదంటూ మదనపడ్డాడు.

గుండె గు'బిల్లు'మంటోంది

జీవిస్నో ప్రింటింగ్ ప్రెస్ యజమానుల్లోనూ కరెంట్ బిల్లులపై తీవ్ర చర్చ జరుగుతోంది. పగలే పనిలేక అవస్థలు పడుతున్నామని, కరెంట్ బిల్లులు చూస్తుంటే రాత్రి, పగలూ వర్క్ చేస్తే ఎంత వస్తాయో అంతకంటే అధికంగా డిసెంబరులో బిల్లులు ఉన్నాయంటూ చెప్పుకోవడం కనిపించింది. కెకె.గణేష్ నిర్వహిస్తున్న ప్రింటింగ్ ప్రెస్‌కు సంబంధించి సర్వీస్ నెంబరు 112311డి033235080కు అక్టోబర్‌లో రూ.330 రాగా తాజాగా రూ.679 వచ్చింది. శీతాకాలంలోనే ఇలా ఉంటే.. వేసవి కాలంలో ఇంకా మోత మోగిపోదా అని ఆయన వాపోయాడు. ఆయనకు ఎఫ్‌పిపిసిఎ 1 కింద రూ.60, ఎఫ్‌పిసిసిఎ 2 కింద రూ.10 సహా డిమాండ్ ఛార్జ్ కింద ఇప్పుడొచ్చిన బిల్లులో అదనంగా రూ.375 భారం మోపారు. ఇలా ఈ ప్రాంతంలోగల 40 షాపుల్లోనూ విద్యుత్ ఛార్జీల మోత నెలలోనే సుమారు రూ.80 వేలకు పైగా పడిందని చిరు వ్యాపారులు చెబుతున్నారు.

ముత్తంశెట్టి తోవలో మరికొందరు ?

సరే సహకరించే నాయకత్వం కరువైంది. ఆయనకు రాజకీయ శిష్యుడిగా విశాఖలో ఉన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పార్టీని అంటిపెట్టుకుని కార్యక్రమాలు చేపడుతున్నారు. బొత్స తనయుడు సందీప్‌ను విశాఖ ప్రజలకు పరిచయం చేసేందుకు బొత్స సత్యనారాయణ ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది.

కార్మిక సంఘాల సంఘీభావం

ఎన్ఎడి మేనేజ్‌మెంట్ మెడలు వంచేందుకు సమిష్టిగా ఉద్యమిస్తామన్నారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రక్షణ రంగంలో కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ పెరిగిందని, వీటిని వ్యతిరేకిస్తున్న వారిని మేనేజ్‌మెంట్లతో అణిచివేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, దీన్ని ఎంత మాత్రమూ సహించేది లేదని అన్నారు. విశాఖ రక్షణ ఉద్యమ ప్రస్థానాన్ని, విజయాలను ఎస్ఎమ్.మౌలాలి తెలిపారు. చట్టప్రకారం ఇవ్వవలసిన వాటిని ఇవ్వకపోతే సిజిపిఎంపై కోర్టు కేసు ఫైల్ చేస్తామన్నారు. ముందుగా విశాఖ రక్షణ రంగంలోని అన్ని యూనియన్ల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా నాయకులు ఎన్ఎడి ఉద్యోగుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. సభకు హాజరైన వారికి నూకరాజు స్వాగతం పలకగా శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు.

కొనసాగిన దీక్ష

ఎన్ఎడి గేటు వద్ద జరుగుతున్న సత్యాగ్రహ దీక్ష గురువారమూ కొనసాగింది. ఎన్ఎడి సిఐ యూనియన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ మేళా ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రకృతి ఆధారిత పంటలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్ కోరారు. మద్దిలపాలెంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆర్గానిక్ మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు మేళా జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఎంఎల్ఎ వెలగపూడి రామకృష్ణ బాబు, రైతు సాధికారత సంస్థ రాష్ట్ర థీమేటిక్ లీడర్ బి.ప్రభాకర్, శాసనమండలి మాజీ సభ్యులు పివి.మాధవ్, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు పిఎల్ఎన్.రాజు, జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ పాల్గొన్నారు.

ఆర్గానిక్ మేళాలో గిరిజన భవన్ స్టాల్ ఆకట్టుకుంది. పాడేరుకు చెందిన రైతులు కృష్ణారావు, శశి ప్రియలు గిరిజన మహిళా కో - ఆపరేటివ్ సొసైటీ సహకారంతో సన్ గ్రీన్ సిఇఒ డాక్టర్ కె.శ్రుతి ఆధ్వర్యంలో స్టాల్ నెంబర్ 130ని పెట్టి గిరిజన ఉత్పత్తులైన గుమ్మడి, అల్లం, పచ్చి పసుపు, చిక్కుడు పిక్కలు, బీన్స్, పసుపు మొదలగు వాటిని అమ్మకానికి ఉంచారు.

శ్మశానాలకు స్థలాలు కేటాయించాలి

విశాఖ కలెక్టరేట్ : ముస్లింల శ్మశాన వాటికలకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని విశాఖ నూర్ బాషా ముస్లిం (దూదేకుల) సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బురాన్, కార్యదర్శి షేక్ బాజ్జి కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యాన గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.

కార్పొరేటర్ గోవింద రెడ్డి క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బుధవారం జరిగిన జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో సచివాలయ ఉద్యోగులను కించపరుస్తూ, వారికి పనీ పాటా లేదని తప్పుడు ఆరోపణలు చేసిన కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి, సెల్ ఫోన్ లైట్లు వెలుగులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఎం.వరప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ భార్గవ్ మాట్లాడుతూ గోవిందరెడ్డి తీరును ఖండించారు.


సెల్ ఫోన్ల వెలుగులో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

మొండి బకాయి రూ.4822 కోట్లు

(మొదటి పేజీ తరువాయి..) ఐదుకు సంబంధించి రూ.836.45 కోట్లు బకాయి చాలా కాలంగా రావడంలేదు. సంస్థకు రావాల్సిన బకాయి వసూలుపై ఇపిడిసిఎల్ ప్రత్యేక కేంద్రీకరణ చేయకుండా వివిధ రూపాల్లో ఛార్జీలు బిగించి సాధారణ వినియోగదారుల నుంచి వసూలుకే అధిక ప్రాధాన్యత ఇస్తోంది. బకాయిలు రాబట్టే పనిచేయకపోతే సంస్థ ఆర్థికంగా గడ్డు పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ఈ ఏడాది అక్టోబర్ 31 నాటికి రూ.50 వేలకు పైబడి రావాల్సిన బకాయిలు (కోట్లలో)

	ఎల్‌టి			హెచ్‌టి	
కేటగిరీ	సర్వీసులు	బకాయి	కేటగిరీ	సర్వీసులు	బకాయి
1 గృహ	746	8.85	1	2	80.30 లక్షలు
2 వాణిజ్యం	2166	43.00	2	364	247.27 కోట్లు
3 పరిశ్రమలు	858	188.36	3	862	1689.03
4 సంస్థాగతం	29,312	1491.06	4	242	299.04
5 వ్యవసాయ అనుబంధం	1146	15.80	5	139	836.45
			రెస్కో	2	2.60

ముగిసిన జాతీయ గిరిజన యువజన సమ్మేళనం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం విశ్వ విద్యాలయం వేదికగా వారం రోజులు పాటు జరిగిన 16వ జాతీయ గిరిజన యువజన సమ్మేళనం గురువారంతో ముగిసింది. ఎన్‌వైకె విశాఖ ఉమ్మడి జిల్లాల అధికారి గొర్లె మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ముగింపు ఉత్సవంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు ఆన్సుమన్ దాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరిచిన ఒడిశాలోని కలహండి జిల్లా విద్యార్థులకు ప్రథమ బహుమతి లభించింది. అదే రాష్ట్రం నుంచి కాందమల్ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. చత్తీస్‌గడ్ నుంచి మొహల్లా - మాన్పూర్ మూడవ స్థానంలో నిలవగా బస్తర్, కాంకర్ జిల్లాలు కన్సులేషన్ బహుమతి గెలుచుకున్నాయి. వక్తృత్వ పోటీలలో ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లాకు చెందిన జర్నపాత్ర విజేతగా నిలిచారు. మొహల్లా నుంచి నీలేష్ కుమార్, కాందమల్ జిల్లా నుంచి పనుగల్ దిగల్ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. కలహండి నుంచి ప్రమోద్ హారిజన్,



జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకున్న యువతతో అధికారులు

మొహల్లా నుంచి ఉమాభారతి కాన్సులేషన్ బహుమతులు సాధించారు. విజేతలకు అతిథులు జ్ఞాపికలను అందజేశారు. 16వ యువ సమ్మేళనంలో పాల్గొన్న యువతీ యువకులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హోమ్ మంత్రిత్వ శాఖ సెక్షన్ ఆఫీసర్ దినేష్ కుమార్ మీనా, ఇన్‌స్పెక్టర్ వీరేంద్ర సింగ్, గీతం విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్వీజీ.రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంసుద్దీన్, కడప ఎన్‌వైకెయు అధికారి కె.మణికంఠ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ క్రమబద్ధీకరణ విభాగం సలహాదారు కాంద్రేగుల వెంకటరమణ, న్యాయవాది బి.రామకృష్ణ, ఎన్‌యుజెఐ జర్నలిజం స్కూల్ వైస్ చైర్మన్ ఎన్.నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.


సమస్యలను కమిషనర్‌కు వివరిస్తున్న హేమలత

యుజిడి సమస్యలపై వినతి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి రాజీవ్ గృహకల్ప, వైఎస్ఆర్ కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలలో యుజిడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు కార్పొరేటర్ మొల్లి హేమలత వినతిపత్రం అందజేశారు. అన్ని కౌన్సిల్ సమావేశాలలో యుజిడి సమస్య పరిష్కరించాలని కోరానని, సమస్య పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయని, టెండర్ ప్రక్రియ జరిగిందని సంబంధిత అధికారులు చెబుతున్నా ఎక్కడా పనులు చేపెట్టలేదని వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. వార్డులో మౌలిక వసతులు కల్పించాలని, తాగునీరు, వీధిలైట్లు సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలని, మధ్యలో నిలిపేసిన శ్మశాన వాటికల అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, కొండవాలు ప్రాంతాలలో కాలువలు, మెట్ల మార్గాలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.

మహిళా సాధికారతపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : మహిళా సాధికారతపై స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా భీమిలి ఎస్ఐ ఎన్.గౌరి హాజరై మాట్లాడుతూ, మహిళలు లైంగిక వేధింపులకు గురి గాకుండా, సురక్షితమైన, గౌరవ ప్రదమైన వాతావరణాన్ని కల్పించాల్సి ఉందని స్పష్టం చేశారు. నిత్య జీవితంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

సచివాలయాన్ని అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస బొగ్గు రోడ్డులో ఉన్న వార్డు సచివాలయాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లోకి మార్చాలని సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బయోమెడికల్ రంగంలో ఎన్ఎమ్ఆర్ కీలకం

గీతం ఎఫ్‌డిపిలో నిపుణుల వెల్లడి

ప్రజాశక్తి -మధురవాడ : వైద్య రంగంలో ముఖ్యంగా బయోమెడికల్ రంగంలో ఎన్ఎమ్ఆర్ (న్యూక్లియర్ మాగ్నెటిక్ రిసోనెన్స్) సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని లక్నోకు చెందిన సెంటర్ ఆఫ్ బయోమెడికల్ రీసెర్చి నిపుణులు వెల్లడించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యాన గురువారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఫార్మాసూటికల్, బయోమెడికల్ రంగాలలో ఎన్ఎమ్ఆర్ ప్రయోజనాలపై నిపుణులు ప్రసంగించారు. సెంటర్ ఆఫ్ బయోమెడికల్ రీసెర్చి నిపుణుడు ప్రొఫెసర్ నీరజ్ సిన్హా మాట్లాడుతూ, ఎన్ఎమ్ఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో ఎముకల సూక్ష్మ పరిశీలన, గాల్‌బ్లాడర్‌లో కేన్సర్ ప్రగతి, శరీరంలోని ద్రవాలలో మార్పులను ఖచ్చితంగా గుర్తించడం, బయోమార్కర్ల పరిశీలన సాధ్యపడుతుందన్నారు. ఎన్ఎమ్ఆర్ స్పెక్ట్రోస్కోపి, 2డి ఎన్ఎమ్ఆర్ పరిజ్ఞానం వంటివి ఔషధ, బయోమెడికల్ పరిశోధనలకు ఉపయోగపడతాయని తెలిపారు. మరో నిపుణుడు ప్రొఫెసర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్ఎమ్ఆర్ సహాయంతో ప్రోటీన్ల అధ్యయనం వాటి క్రియాశీలతను లోతుగా పరిశోధించడం సాధ్యపడుతుందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాష్ గీతంలో పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గీతం విశిష్ట ప్రొఫెసర్ ప్రొఫెసర్ బివిఆర్ టాటా మాట్లాడుతూ, దాదాపు రూ.60 కోట్లతో ఎన్ఎమ్ఆర్ వంటి అధునాతన పరికరాలతో గీతం మూర్తి ప్రయోగశాలలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అధ్యాపకులు వీటిని ఉపయోగించుకుని దేశం గర్వించ తగ్గ పరిశోధనలు చేపట్టాలని కోరారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కన్వీనర్ ప్రొఫెసర్ జగదీష్ భరతం తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి ప్రణాళికల తయారీపై శిక్షణ


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనందపురం ఎంపిడిఒ జానకి

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : గ్రామ స్థాయిలో అభివృద్ధి ప్రణాళికల తయారీపై గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ, గ్రామ సచివాలయ కార్యదర్శులు, సిబ్బందికి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. విద్య, వైద్యం, ప్రజారోగ్యం, రక్షిత తాగు నీరు, మహిళా, శిశు సంరక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. రెండ్రోజులు జరుగనున్న ఈ శిక్షణా తరగతులనుద్దేశించి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు మాట్లాడుతూ, గ్రామాల సమగ్రాభివృద్ధికి క్షేత్ర స్థాయిలో ప్రణాళికలు తయారుచేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని కోరారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విధి నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీ తనం ఉండాలని సూచించారు. వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, ఎంపిడిఒ ఎన్.హనుమంతరావు, ఇఒపిఆర్‌డి కనకల రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. శిక్షణా తరగతుల కో-ఆర్డినేటర్ కె.కరుణాకరరావు మాట్లాడుతూ, సామాజిక, ఆర్థిక అసమానతలు లేని గ్రామాలుగా తీర్చి దిద్దడమే శిక్షణా తరగతుల ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

ఆనందపురం : మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ జానకి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధిపై లక్ష్యాలు, స్థానికీకరణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యదర్శులతో పాటు పంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 పోటీలు గురువారం ఉత్సహంగా సాగాయి. ఈ సంవత్సరం పరిష్కరించడానికి ఇచ్చిన సమస్యలలో ఆసక్తిదాయకమైన అంశాలు కొన్ని ఉన్నాయి. వాటిలో ఇస్రో ఇచ్చిన 'చంద్ర గ్రహంలో చీకటి నిండి ఉన్న ప్రాంతాల చిత్రాల్లో స్పష్టతను పెంచడం, జలశక్తి మంత్రిత్వశాఖ ఇచ్చిన గంగానదిలో నీటి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థకు కృత్రిమ మేధ (ఎఐ) ఎలా ఉపయోగించ వచ్చు, ఉపగ్రహం అందించే సమాచారం, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి)తో పాటు డైనమిక్ మోడల్స్‌ను ఉపయోగించుకుంటూ వాస్తవ కాల ప్రాతిపదికన పనిచేసే ఒక వ్యవస్థను అభివృద్ధి చేయడంతో పాటు అయుష్ శాఖ ఇచ్చిన "కృత్రిమ మేధ సాయంతో పనిచేసే ఒక స్మార్ట్ యోగ మ్యాట్‌ను అభివృద్ధిపరచడం వంటివి పోటీ అంశాలుగా విద్యార్థుల ముందు ఉంచారు.

దేశంలోని 14 రాష్ట్రాల నుంచి 290 మంది యువతీ, యువకులు గీతంలో జరుగుతున్న ఈ పోటీలకు హాజరయ్యారు. తమిళనాడు నుంచి అత్యధికంగా 11 జట్లు హాజరుకాగా ఆంధ్రప్రదేశ్ సహ ఇతర రాష్ట్రాల నుంచి రెండు జట్లు చొప్పున హాజరయ్యాయని గీతం పర్యవేక్షకుడు రాజ్‌కుమార్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

పేకాటశిబిరంపై దాడి

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని నూతనగుంటపాలెంలో పేకాట స్థావరంపై గురువారం సాయంత్రం కశింకోట పోలీసులు దాడి చేసి పేకాటాడుతున్న ఐదుగురిని పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.15వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.


టెక్నికల్ ఫెస్ట్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అవంతిలో 'జ్ఞాన్ -2 కె 24'

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 20, 21 తేదీల్లో 'జ్ఞాన్ -2 కె 24' టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతిక నైపుణ్య కార్యక్రమాలు, పోస్టర్ ప్రెజెంటేషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, సాంకేతిక క్విజ్, టెక్నికల్ యాక్టివిటీస్ తదితరాలు టెక్ ఫెస్ట్‌లో ఉంటాయని వివరించారు. వినూత్న ఆలోచనలను వ్యక్త పరిచేందుకు, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించేందుకు టెక్ ఫెస్ట్ వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం ఈ సాంకేతిక సదస్సుల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. టెక్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమంలో సాంకేతిక కార్యక్రమాల విజేతలకు రూ.2 లక్షల విలువైన బహుమతులు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, డైరెక్టర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు

రామకృష్ణాపురంలో ఆక్రమణలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి కేంద్ర కారాగారం ఎదురుగా ఉన్న రామకృష్ణాపురంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని దర్జాగా అనధికార నిర్మాణాలు చేపడుతున్నారు. బిఆర్‌టిఎస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో ఈ నిర్మాణాలు సాగుతున్నా రెవెన్యూ, జివిఎంసి అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. గతంలో ఈ స్థలాన్ని ప్రభుత్వం కొంతమందికి పందుల పెంచేందుకు కేటాయించారు. గత కొన్నేళ్లుగా ఈ స్థలం ఖాళీగా ఉంది. ఇప్పుడు ఈ స్థలంలో కొంతమంది దీనికి వారసులమని చెప్పి ఆక్రమించి రేకుల షెడ్డులు నిర్మించేశారు.


ప్రభుత్వ స్థలంలో వెలసిన రేకుల షెడ్డులు

మినీ గోకులం షెడ్ల బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : గతంలో నిర్మించిన మినీ గోకులం షెడ్ల లబ్ధిదారుల్లో కొంత మందికి ఇప్పటికీ పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించలేదని, మరి కొంతమందికి అసంపూర్తిగానే బిల్లులు చెల్లించారని జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు సభలో ప్రస్తావించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ప్రాంగణంలో గురువారం ఎన్ఆర్ఇజిఎస్ ఆధ్వర్యాన ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సభలో వెంకటప్పుడు మాట్లాడుతూ, మినీ గోకులం లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపుల్లో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిందని, కొన్ని చిన్న పాటి సాంకేతిక కారణాలు చూపి బిల్లుల చెల్లింపుల్లో తాత్సారం చేయడం తగదని అన్నారు. సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పి ఎం.నాగరాజు ఆధ్వర్యాన 8 మంది డిఆర్‌పిలు 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 831 పిఆర్ ఉపాధి పనుల తీరు తెన్నులపై డిసెంబర్ 1 నుంచి 12 వరకు సామాజిక తనిఖీలు నిర్వహించారని, సంబంధిత పనులకు వేతనాల రూపంలో రూ.5.58 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.1.49 కోట్లు ఖర్చు చేసినట్లు ఎస్ఆర్‌పి వివరించారు. వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.పూర్ణిమాదేవి, జిల్లా విజిలెన్స్ అధికారి సిహెచ్ నిర్మలా దేవి, ఎన్ఆర్ఇజిఎస్ ఎపిడి కె.ఆంజనేయులు, ఎంపిడిఒ ఎన్.హనుమంతరావు, ఇఒపిఆర్‌డి కనకల రమేష్ నాయుడు, ఉపాధి పథకం ఎపిఒ గౌరి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు : పంచకర్ల

ప్రజాశక్తి-పెందుర్తి : అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ల అని, అవి ఎక్కడా కూడా ఆగకూడదని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అభివృద్ధి గురించి అధికారులు వివరించారు. గ్రామాల్లోని సమస్యలను పలువురు సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, మళ్లీ నెల రోజుల్లో జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని, ఆ సమయానికి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మద్యం విచ్చలవిడిగా అమ్మరాదని, ఆ షాపులు సమయపాలన పాటించేలా చూడాలని చెప్పినట్లు పేర్కొన్నారు. బెల్ట్ షాపులు కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నాగమణి, ఎంపిడిఒ వెంకట్రావు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా మండలి సదస్సులో ఎయు అధికారులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఉన్నత విద్యా మండలి వర్చువల్ విధానంలో నిర్వహించిన సదస్సులో ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు పాల్గొన్నారు. ఉన్నత విద్యా మండలి ఇన్చార్జ్ చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో ఈ సమావేశంలో ప్రసంగించారు. ప్రధానంగా స్వర్ణాంధ్ర 2047 అంశం దిశగా చర్చించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన టెక్సాస్ యూనివర్సిటీ ఆచార్యులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని టెక్సాస్ ఎ అండ్ ఎం యూనివర్సిటీ ఆచార్యులు సందర్శించారు. గ్రాడ్యుయేట్ స్టడీస్ విభాగం డీన్ టింగ్‌లు, పబ్లిక్ హెల్త్ విభాగం ప్రొఫెసర్ విజయ్ గొల్ల, ఎయు విసి ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు విశ్వవిద్యాలయాల మధ్య సంయుక్తంగా పనిచేసే అంశంపై చర్చించారు. సంయుక్తంగా కోర్సులు నిర్వహణ పరిశోధనా రంగంలో కలిసి పనిచేయడం, తదితర అంశాలపై ప్రాథమిక చర్చలు జరిపారు. కంప్యూటర్ సైన్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, ఆటిజం సంబంధించిన కోర్సుల నిర్వహించడానికి వీరు ఆసక్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -తగరపువలస : ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకలను కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. అనేక రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృత స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. కొత్త ప్రదేశాలు, కొత్త వ్యక్తుల పట్ల సహజంగా ఉండే భయాందోళనలను పోగొట్టి, విద్యార్థుల్లో స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించడమే ఫ్రెషర్స్ డే వేడుకల ముఖ్యోద్దేశమని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. సహచర విద్యార్థులతో మంచి స్నేహ బంధం కలిగి ఉండాలన్నారు. జెఎన్‌టియు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్చార్జి డైరెక్టర్ (విజయనగరం),డాక్టర్ గంటా స్వామినాయుడు మాట్లాడుతూ, కృషి, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కమ్యూనిటీ ఆపరేషన్స్ మేనేజర్ ఉజెర్, ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్ర శేఖర్, డాక్టర్ యు.రాము, పి.సత్య నారాయణ పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విఎంఆర్‌డిఎ పరిధిలో తొలగించిన పదకొండు మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విఎంఆర్‌డిఎ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వి.కృష్ణారావు మాట్లాడుతూ, విఎంఆర్‌డిఎ పరిధిలోని కైలాస్‌గిరి, ఎన్‌టిఆర్ విఎంఆర్‌డిఎ పార్కు, డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సెంట్రల్ పార్కు, తెన్నేటి పార్కుల్లో గత 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న 11 మంది కార్మికులను 60 ఏళ్ల నిండిన కారణంగా విధుల నుండి నిలుపుదల చేసారని, వీరంతా సొసైటీ కార్మికులు కనుక వీరిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల వయస్సు 60 సంవత్సరాలు పూర్తయ్యాయని డిఎఫ్ఒ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అగ్రికల్చర్ విభాగం ఉద్యోగులు బలరాం, రమేష్ ప్రమేయంతో అన్యాయంగా నిలుపుదల చేశారన్నారు. ఎటువంటి నోటీసులు జారీచేయకుండా ఈ చర్యలకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. వీరి స్థానంలో ముడుపులు తీసుకొని కార్మికులను, అధికారుల కుటుంబాలను కుటుంబ సభ్యులను వేయించుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. విఎంఆర్‌డిఎలో సొసైటీ కార్మికులుగా 220మంది పనిచేస్తున్నారన్నారు. వీరికి ఇఎస్ఐ, పిఎఫ్, వేతనంతో కూడిన వారంతపు సెలవులు, లేబర్ హాలీడేస్, కార్మికచట్టాలు అమలు చేయడం లేదన్నారు. డైలీవేజ్ కార్మికునికి కార్మిక చట్టాలు వర్తింపజేయకుండా శ్రమదోపిడీ చేయడం నేరం అన్నారు. డైలీవేజ్ కార్మికులను కష్టపడి పనిచేసే వరకు కొనసాగించాలని, లేకుంటే కార్మికచట్టాలు వర్తింపచేసి 30 ఏళ్ల పనిచేసిన కాలానికి రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 11 మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని విఎంఆర్‌డిఎ కమిషనర్, చైర్మన్‌ను కోరినా స్పందించకపోవడం అన్యాయం అన్నారు. తక్షణమే జోక్యం చేసుకొని వీరికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, డి.నరసింగరావు, ఒ.అప్పారావు, వి.అప్పారావు, చిన్నారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసననుద్దేశించి మాట్లాడుతున్న కృష్ణారావు

విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలో పాల్గొన్న కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షులు పిల్లా భాస్కరరావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమస్యలపై విశాఖ డెయిరీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారమూ కొనసాగాయి. గురువారం చేస్తున్న దీక్షలకు విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, విశాఖ డెయిరీలో పర్మినెంట్ కార్మికులతో పాటు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. ఐదేళ్ల సర్వీసు ఉన్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని కోరారు. 20 నుంచి 30 సంవత్సరాల అనుభవం ఉన్న కార్మికులను కూడా పర్మినెంట్ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి నాగ మారిణీ బాబు, ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ, కార్మికులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక : ఉడా కాలనీ వినాయకనగర్‌లో రూ.20 లక్షలతో ఏర్పాటుచేయనున్న హెచ్‌డిపిఇ పైప్‌లైన్‌కు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మంచి నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 72వ వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ మాట్లాడుతూ, వార్డులో మౌలిక సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ శ్రీనివాసరావు, ఎఇ కేదార్, టిడిపి నాయకులు ఎ.లక్ష్మణరావు, సాలాపు రామారావు, ప్రసాదుల శ్రీనివాస్, స్థానిక పెద్దలు గుడివాడ అమ్మన్న, మరడాన రామారావు, సిపిఐ నాయకులు అప్పారి విష్ణుమూర్తి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ఘంటసాల గానోత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఘంటసాల 102వ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే ఘంటసాల గానోత్సవాలను విజయవంతం చేయాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. వీటికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం శివాజీపాలెం సవేరా ఫంక్షన్ హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ, డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రోజు సాయంత్రం 6 గంటలకు ఘంటసాల సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, సినీ హీరో ఉపేంద్ర బాబు, 15వ తేదీన పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, హైకోర్టు న్యాయవాది ఎస్‌కె మహంతి హాజరవుతారని వివరించారు. సోమేష్ సంగీత నిర్వహణలో జరిగే సంగీత విభావరిలో ఘంటసాల గీతాలను గాయకులు ఆలపిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కళారంగ ప్రముఖులు జి.త్యాగరాజన్, వీరేంద్ర యాదవ్, పిన్నింటి ఆదిమూర్తి పాల్గొన్నారు.

నేడు టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ చాంపియన్‌షిప్‌కు విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ ఆధ్వర్యాన విశాఖ జిల్లా క్రీడాకారుల ఎంపిక శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి విశాఖపట్నం రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎంక్లావే (ఆర్ఐఎస్ఇ) ప్రాంగణంలో నిర్వహిస్తున్నమని ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డివిఎస్వై శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న 15 ఏళ్లలోపు బాలబాలికలు, మహిళలు 9052667766 వాట్సాప్ నంబర్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతరలో శుక్రవారం నుంచి చేనేత మేళా-రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహించనున్నట్లు శిల్పారామం ఎఒ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. చేనేత వస్త్ర కళాకారులు నేరుగా అమ్ముకొనుటకు ఆంధ్రప్రదేశ్ శిల్పారామం సొసైటీ ఈ ప్రదర్శన చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ నెల 26 తేదీ వరకు ఈ ప్రదర్శన ఉంటుందని వివరించారు. భారతదేశంలోని అనేక రాష్ట్రాల నుంచి వచ్చి తమ ఉత్పత్తులను అమ్మకానికి ప్రదర్శిస్తారని తెలిపారు.

దళితుల నిరసన

ప్రజాశక్తి- తగరపువలస : మహారాష్ట్రలో భారత రాజ్యాంగ ప్రతిని చించివేసిన దత్తా రావు పవర్‌పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భీమిలి మండలం తాళ్లవలస జంక్షన్‌లో గురువారం దళితులు నిరసన తెలిపారు. రాస్తా రోకో నిర్వహించారు. తాళ్లవలస డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బోని సన్ని బాబు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి, మాల మహానాడు వ్యవస్థాపకులు భాగం గోపాలరావు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎస్.రాంబాబు, ఎం.శివకుమార్, బి.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ అర్పించారు.

'చాగంటి నియామకంపై పునరాలోచించాలి'

ప్రజాశక్తి-మాధవధార : విద్యా విలువల సలహాదారుడుగా ప్రవచనకారుడు చాగంటి కోటేశ్వరరావును నియమించడంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించుకోవాలని పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు కోరారు. విద్యార్థుల్లో స్వాతంత్ర ఉద్యమ, సంస్కరణోద్యమ, రాజ్యాంగ విలువల ప్రచారం జరగాలని, ప్రజాస్వామ్యం, లౌకికవాదం పునాదిగా ఉండే విలువలు ఆధునిక జీవితానికి అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులను శక్తివంతమైన విశ్వ మానవులుగా తీర్చిదిద్దడానికి మొదట విద్యారంగంలో తీవ్రమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరముందని తెలిపారు. పురాణ కాలపు నైతిక విలువలను బోధించడం వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. ప్రపంచమంతా పరుగులు తీస్తున్న ధోరణికి భిన్నంగా భవిష్యత్తు తరాన్ని పురాణ యుగంలోకి మళ్లించడం మనల్ని ఎక్కడికి తీసుకెళ్తుందో ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

ఇసుక తవ్వకాల్లో నిబంధనలకు పాతర!

- ఉచితంగా మాటున యథేచ్ఛగా అక్రమాలు
- ముడుపుల మత్తులో చోద్యం చూస్తున్న అధికారులు
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకన్న



శారదానది తీరంలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న సిపిఎం నేత డి.వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఉచిత ఇసుక నిబంధనలకు పాతర వేస్తూ, వాల్టా చట్టాన్ని పూర్తిగా ఉల్లంఘించి శారదా పరివాహక ప్రాంతాన్ని గుళ్లచేసి ఇసుక తవ్వకాలు, తరలింపుతో నాశనం చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు డి వెంకన్న విమర్శించారు. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు మామ్ముళ్ళు ఇస్తున్నామని, తమ జోలికి ఎవరూ వచ్చే పరిస్థితి లేదని ఇసుకాసురులు బాహాటంగానే చెబుతున్నారంటే ఈ దందా ఏస్థాయిలో జరుగుతోందో స్పష్టమౌతోందన్నారు.

గురువారం తామరబ్బ, తెనుగుబూడి, వెంకట రాజుపురం, తిమిరాం, వేచలం, బోయిల కింతాడ గ్రామాల్లో శారదానదిలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాలను పరిశీలించార. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఇసుక మాఫియాకు, కొంతమంది అధికారులకు, కాసులు పండించేదిగా ఉందని ఆరోపించారు. శారదనదీ పరివాహకప్రాంతం, గర్భం నుంచి ఇసుకను తవ్వి, యథేచ్ఛగా తరలిస్తున్న అక్రమార్కులు ప్రతినెలా అధికారులకు రూ.15వేలు నుంచి రూ.20వరకు ముడుపులు సమర్పించుకుంటున్నామని, వారు తమ జోలికి వచ్చే పరిస్థితి లేదని చెబుతున్నారని ఆరోపించారు. దీంతో బరితెగించి, యథేచ్ఛగా, గతంలో ఎన్నడూ కానరానంతగా ఇసుక దందా సాగుతోందని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తిగతంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి, ప్రభుత్వ నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా ఉపయోగించు కోవాలనే నిబంధన ఉన్నప్పటికీ, దానికి విరుద్ధంగా ఇతర మండలాలకు, జిల్లాలకు ఇక్కడి నుంచి ఇసుక తీసుకుపోతున్నార్నారు. ట్రాక్టర్లతో ఇసుక తరలించా లంటే అధికారుల అనుమతులు పొంది, సంబంధిత పత్రాలతో కేవలం పగటిపూటే తీసుకెళ్లాల్సి ఉండగా, ఈ నిబంధనలన్నీ బేఖాతరు అవుతున్నాయని ఆరోపించారు.

ఇటీవల దేవరాపల్లి మండల సందర్శనకు వచ్చిన జిల్లా ఎస్పి, ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపుతామని, రాత్రివేళల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ ఇసుక తవ్వకాలు, తరలింపు చేపట్టరాదని స్పష్టంగా హెచ్చరించినప్పటికీ, అందుకు భిన్నంగానే ఇక్కడ పరిస్థితులున్నాయని ఆరోపిస్తున్నారు. వాల్టా నిబంధనల మేరకు ఇసుక తవ్వకాల్లో ప్రొక్లెయినర్లను వాడరాదని, పరిమితికి సరిపడా లోతులోనే ఇసుక తవ్వకాలు చేపట్టి, తీసుకెళ్లాలని ఉన్నా అది కాగితాలకే పరిమితమై పోయిందని ఆరోపించారు.

కొన్ని గ్రామాల్లో ఇసుక ర్యాంపుల నిర్వహణకు బహిరంగంగానే వేలం పాటలు నిర్వహించి, బహిరంగంగానే వసూళ్లు చేపడుతున్నారని, దీనికి గ్రామాభివృద్ధి అనే ముసుగు వేసి, నాయకులు భాగస్వాములు కావడం దారుణమన్నారు. నదీ పరివాహక ప్రాంతాలకు, భూగర్భజలాలకు ముప్పు వాటిల్లే, భావితరాలకు నీటిసమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితులు కల్పించేలా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నా, అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం, అడపాదడపా తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకోవడం సరికాదని వెంకన్న ఆవేదన వెలిబుచ్చారు. నిజమైన లబ్ధిదారులకు ఉచిత ఇసుక అంది, న్యాయం జరగాలంటే ఈ వ్యవహారంపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారుల వివరణ, స్పందన తెలియాలి.

15న సైనిక్, నవోదయ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి -అనకాపల్లి : ఈనెల 15న స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా హర్ష (హెచ్‌వియస్) అకాడమీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైనిక్, నవోదయ మోడల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అకాడమీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి అచ్యుతాపురం, ఎలమంచిలి పరవాడ గాజువాక, సబ్బవరం దేవరపల్లి చోడవరం, పాడేరు రావికమతం, నర్సీపట్నం, విజయనగరం, అడ్డు రోడ్డు పరీక్ష కేంద్రాల్లో జరుగు ఈ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 8184838525 నెంబరును సంప్రదించాలన్నారు.

రైఫిల్ షూటింగ్ పోటీల్లో సంస్కృతి గ్లోబల్ విద్యార్థుల ప్రతిభ



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-పరవాడ : ఈ నెల13 వచ్చేనెల 5 వరకు ఢిల్లీ, భోపాల్‌లో నేషనల్ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్నారై) నిర్వహిస్తున్న 67వ జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల కోచ్ రామ్మోహనరావు తెలిపారు గత నెలలో జరిగిన సౌత్ జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలలో ప్రతిభ కనబర్చిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఎస్. సురేంద్ర, సాయిరవి, వి.భాను, పి. అక్షయ్, పి.జస్వంత్, ఎన్.నిష్టల, విద్యా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్కూల్ సిఇఒ కె.నిశాంత్ అభినందించి, జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

వికలాంగుల అభ్యున్నతికి సహకారం



సిఐని సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి - కశింకోట : వికలాంగుల అభ్యున్నతికి అందరూ సహకరించాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం మండలంలో చింతలపాలెం గ్రామంలో ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా కశింకోట మండల విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షులు ఎస్‌కె రెహమాన్, మండల అధ్యక్షులు జాగారపు సత్యం నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో సిఐ అల్లుస్వామి నాయుడు మాట్లాడుతూ, వికలాంగులను ప్రతిఒక్కరూ ఆదరించాలని, అర్హులకు ప్రభుత్వ పథకాలు అంది పుచ్చుకునేలా ప్రోత్సాహించాలని కోరారు. ఎస్ఐ మనోజ్ కుమార్, విశాఖ డియిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ కోకన్వీనర్ ప్రభావతి, బి.వి. నాయుడు, సిగిరెడ్డి నాగేశ్వరరావు ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, రాపేటి భాస్కర రావు, గుమ్మాల భవాని, ఎస్‌కె దర్గాభాషా పాల్గొన్నారు.

నేటి వైసిపి నిరసనను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈ నెల 13న నిర్వహించే అన్నదాతకు అండగా వైసిపి అనే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాలనాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. సూపర్ సిక్స్ హామీలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు. రైతుకు అండగా నిలవడంలో విఫలమైందన్నారు. దీనికి నిరసనగా వైసిపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అనకాపల్లిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపడతామన్నారు.. కలెక్టరుకు వినతి పత్రం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ, ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20వేలు ఇవ్వాలని సూపర్ సిక్స్ హామీని ప్రభుత్వం అమలు చేయాలని, ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు దళారీ వ్యవస్థను తొలగించాలన్నారు. తడిసిన రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తేమ లెక్కలతో ఇబ్బంది పెట్టడం మానుకోవాలని కోరారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని రైతుపై అదనపు భారం విడనాడాలని కోరారు.నిరసన ర్యాలీలో పెద్ద ఎత్తున కార్యకర్తలు నాయకులు అభిమానులు పాల్గొనాలని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, మలసాల కుమార్ రాజా, మలసాల రమణారావ్, ఎంపిపి గొర్లి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద, జాజుల రమేష్, కేఎం నాయుడు, బొడ్డేడ శివ, కళ్యాణ బాబు, కోరుకొండ రాఘవ, మాధురి నాయుడు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు అధికారులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని16 సాగునీటి సంఘాలకు ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు సహాయకులను అధికారులు నియమించారు. మండలంలోని ఆర్ శివరాంపురం కొత్తచెరువు, సోమయాజుల చెరువు ఆర్ భీమవరం, కృష్ణ సాగరం, పి.భీమవరం లోవ చెరువు, బట్లోవా, వడ్డాది ఛానల్, నేరెళ్ల చెరువు పి.భీమవరం, రౌతు నెయ్యలవాని చెరువు పైపురం పెద్ద చెరువు, సోమయాజుల చెరువు తురకలపూడి, అమృతవాణి చెరువు రాజాం సింహాద్రి చెరువు, రాజాం, రాళ్లపాటి కాలువ, విజయరామరాజుపేట, తుమ్మలూరి కాలువ మంగళాపురం ఆయకట్టు, విజయరామరాజుపేట, ఆర్‌ఎంసి గున్నెంపూడి సాగునీటి వనరులకు ఎన్నికలు జరుగుతాయని, ఆయాగ్రామాల్లోని పాఠశాలల్లో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు.

సబ్బవరం.:ఈనెల 14న సాగునీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇరిగేషన్ ఎఇఇ సాయికిరణ్ తెలిపారు. సబ్బవరం మండలంలో 23, పరవాడ మండలంలో రెండు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క సంఘానికి ఆరు ప్రాదేశిక నియోజకవర్గాలుగా విభజించి, ఎన్నికల నిర్వహణకు ఒక ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారి, పోలింగ్ ఆఫీసర్లు ఇద్దరు, పోలింగ్ అసిస్టెంట్ ఆఫీసర్లు ఇద్దరు చొప్పున.25సాగు నీటి సంఘాలకు 150 మంది ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు బందోబస్తుతోపాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

సీనియర్ సివిల్ జడ్జిగా శంకరరావు

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం సీనియర్ సివిల్ జడ్జిగా వి.గౌరీ శంకరరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ, ఉద్యోగోన్నతిపై చోడవరం సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులు కాగా, గురవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన న్యాయమూర్తి శంకరరావును బార్ కౌన్సిల్ సభ్యులతోపాటు పలువురు అభినందనలు తెలిపారు.

120 రోడ్ల నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి- కె.కోటపాడు : మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.27.44కోట్లతో 193 సిమెంట్ కాంక్రీట్ రోడ్లు, రెండు బిటి రోడ్లు మంజూరుకాగా, వాటిల్లో 120 పనులు పూర్తయ్యాయని పంచాయతీరాజ్ శాఖ మాడుగుల సబ్‌డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వెంకటరావు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాడుగుల, చీడికాడ, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో 32 కిలోమీటర్ల మేర సిసి. రోడ్ల నిర్మాణంలో ఇప్పటిదాకా 16 కిలోమీటర్ల సిసి.రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఈ నెలాఖరులోగా మిగతా 16 కిలోమీటర్ల సి.సి.రోడ్ల పనులు, రెండు తారురోడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో నిర్మాణ పనులు చర్యలు చేపడుతున్నామని డిఇఇ వెంకటరావు వివరించారు. కార్యక్రమంలో మండల ఇంజనీరు సుమతి, తదితరులు ఉన్నారు.

బస్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి- మాడుగుల : మాడుగుల ఆర్‌టిసి బస్ స్టేషన్‌ను పునర్వినియోగంలోకి తేవాలని కూటమి నేతలు కోరారు. ఈ మేరకు విజయనగరం ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ దొన్నుదొరను కలిసిన బిజెపి నేత కొట్యాడ రమేష్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బా రమేష్ వినతిపత్రం అందజేశారు. అలాగే బస్‌కాంప్లెక్స్ దుస్థితిని డ్రోన్‌తో వీడియో తీసి దొన్నుదొరకు చూపించి వివరించారు. విశాఖ, పాడేరు, అరకు మధ్య తిరిగే ఆర్‌టిసి బస్సులు మాడుగుల వచ్చివెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్తరాంధ్రకు సాగు, తాగునీరు లక్ష్యం



.మాట్లాడుతున్న పీలా గోవింద

ప్రజాశక్తి- అనకాపల్లి: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా ఉత్తరాంధ్రకు సాగు,తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక రింగ్ రోడ్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధ్యక్షతన సాగు నీటి సంఘాల ఎన్నికలపై కూటమి పార్టీ శ్రేణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సాగు నీటి సంఘాల ఎన్నికలను రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తామన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో పంట కాలువలకు పూడికలు, గ్రోయిన్లను మరమ్మత్తులు చేస్తామని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : 33/11 కేవీ కసింకోట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో గల 33/11 కె.వి కొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవి కొత్తూరు పట్టణం 1ఫీడర్, 11 కె.వి కసింకోట ఎంహెచ్‌క్యూ ఫీడర్, కూండ్రం రూరల్ ఫీడర్ మరమ్మత్తులు, చెట్టుకొమ్మలు తొలగింపు కారణంగా కొత్తూరు, మూలపేట, సత్యనారాయణపురం, సంపతిపురం, వేట జంగాల పాలెం, కూండ్రం, కుంచంగి, రొంగలి వాని పాలెం, పిసినికాడ గ్రామాలకు ఈ నెల 13న శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు నేపథ్యంలో కన్నూరుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపిఈపిడిసిఎల్ ఆపరేషన్స్ ఇఇ ఎస్.రామకృష్ణ ప్రకటన లో తెలిపారు. కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని కన్నూరుపాలెం, తీడ, చరకం, సుందరయ్యపేట, ఆనందపురం, లాలం కొత్తూరు జీ.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, మోస్సి పేట, గోకువానిపాలెం, రమన్నపాలెం, భీంబోయినపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

పలుచోట్ల టిడిపి సభ్యత్వ నమోదు



సభ్యత్వాలు అందజేస్తున్న మళ్ల సురేంద్ర

ప్రజాశక్తి- అనకాపల్లి : ఎన్నికల హామీలను నెరవేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. గురువారం అనకాపల్లి పట్టణం 81 వ డివిజన్ కస్పా వీధి, వేగి వీధి, ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సభ్యత్వం నమోదును నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ నేతృత్వంలో చురుగ్గా సాగుతోందన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ఉపయోగాలు వివరించారు కార్యక్రమంలో ఎండకుర్తి అప్పలరాజు, వేగి కృష్ణ, పిడి ప్రసాద్, పీలా శ్రీనివాసరావు, బాబి, రీసు అప్పలాచారి, తణుకు రవి, కాండ్రేగుల వెంకట జగ్గారావు, నంద్యాల అప్పారావు, బుద్ధ సాయి, మల్ల గణేష్ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

ప్రజాశక్తి.-సబ్బవరం : ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న సాగునీటి సంఘాలు ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయానికి నేతలు కృషి చేయాలని ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్, పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ గండి బాబ్జి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఐరువాడ దరి ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో పెందుర్తి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ చెరువుల అభివృద్ధికి రైతుల భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సాగునీటి సంఘ ఎన్నికలను నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాలలో చెరువులను అభివృద్ధి చేయాలనే సంకల్పం, ఆసక్తి ఉన్నవారిని ఎన్నికల్లో నిలబెట్టి గెలిపించాలన్నారు 2026 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు, తాగునీరు అందించే దిశలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, టిడిపి



మాట్లాడుతున్న కోఆపరేటివ్ ఆయిల్ గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్ బాబ్జి

నేతలు గండి దేముడు, రెడ్డి నారాయణరావు, దాసరి వెంకటరమణ, రొంగలి దేముడు,గవర అప్పారావు, కె రామకృష్ణ రాజు, పడాల వెంకట రమణ ,పల్లా తాతారావు, కోరాడ శ్రీనివాసరావు, రేసుపూడి రమణ ,ఆకుల గణేశ్,ఆడారి నాగరాజు,పెద్దాడ రమణమ్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మునగపాక: సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రతి కార్యకర్త సన్నద్ధం కావాలని ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక కో ఆపరేటివ్ సొసైటీ సమావేశ మందిరంలో మండల టిడిపి కార్యకర్తల తో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరసెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగ భూషణం, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసలి నాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, మొల్లెటి సత్యానారాయణ తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆడారి జానకి, జిల్లా యాదవ సాధికార సమితి కన్వీనర్ సబ్బీ శ్రీనివాసరావు, ఉలింగల గోవిందా, మొల్లి వెంకు నాయుడు, విల్లూరి నర్సింగరావు,దాడి శివ,వెలగా మురళి, పెంటకోట శ్రీరామమూర్తి, దాడి శ్రీను పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి- కె..కోటపాడు: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై సచివాలయ సిబ్బందికి గురువారం శిక్షణనిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణకు మండల పరిషత్ పరిపాలనాధికారి సబ్బి అప్పలరాజు కోర్స్ డైరెక్టర్గా వ్యవహరించారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వేతో పాటు బ్యాంకు ఖాతా ఆధార్ లింకింగ్, పాఠశాలలు, ఆశ్రమ వసతి గృహ తనిఖీలు, గ్రామసభల ఏర్పాటు, న్యాయపరమైన సుపరిపాలన, పల్లెల్లో పచ్చదనం, తాగునీరు, స్వయం సమృద్ధి, సంపద కేంద్రాల నిర్వహణ తదితర 17 లక్ష్యాలను ఎంపిక చేసి వాటిపై శ్రద్ధ చూపాలని సూచించారు. అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్గా ఇఒపిఆర్‌డి రమణ వ్యవహరించారు. శిక్షణలో ఆర్డబ్ల్యూఎస్ ఎఇ శ్రీకాంత్, వెలుగు ఏపిఎం చినబాబు, మండల ఇంజనీర్ సుమతి, సిడిపిఒ మంగతాయారు పాల్గొన్నారు.

సబ్బవరం : గ్రామాలలో సమీకృత అభివృద్ధి లక్ష్యాలపై పలు శాఖల అధికారులకు, గ్రామ కార్యదర్శులకు, సర్పంచ్ లకు రెండు రోజులు శిక్షణా తరగతులను అందిస్తున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్ ఎంపిడిఒ పి. పద్మజ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణలో మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, అభివృద్ధి వనరులను సమకూర్చుకోవడం, త్రాగునీటి యాజమాన్య పద్ధతులు, నిర్వహణ, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, ఆరోగ్యం,తదితర అంశాలపై రెండు రోజుల శిక్షణ ఉంటుందన్నారు.ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ శ్రీనివాస్, మండల ఇంజనీర్ హరిణి, సిడిపిఒ లలితకుమారి, వెలుగు ఏపిఎం శ్రీనివాస్ వైద్యాధికారులు, సర్పంచులు ప్రసాదరావు, సబ్బవరపు నారాయణమూర్తి, పడాల వెంకటరమణ, కర్రి నరసింగరావు,మామిడి శంకర రావు పాల్గొన్నారు.

రైతన్నల్లో అల్పపీడనం గుబులు

ప్రజాశక్తి - సీలేరు: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో మరొక రెండు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరికలతో గిరిజన రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.ప్రస్తుతం ఖరీఫ్ వరిపంట కోతకు సిద్ధంగా ఉండడంతో ముందుకు వెళ్లలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కొమ్ములువాడ, బంధ వీధి రాళ్లగడ్డ, కాట్రగెడ్డ, పిల్లిగెడ్డ, సంత నేరేడుపల్లి, జి. నేరేడుపల్లి, నిమ్మచెట్లు, హరిపురం తదితర గ్రామాల్లో వరి పంట ఎర్రబారి కోతకు సిద్ధంగా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసినా, గాలులు వీచినా పంటకు నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోసిన వరిచేనును భద్రపరుచుకోవడం రైతులకు ఇబ్బందికరంగా ఉంది. అలాగని కోయకుండా ఊరుకుంటే, వర్షాలు, గాలులతో చేను నేలవాలితే నష్టతీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో అకాలవర్షాలుతో జరిగిన నష్టం రైతన్నలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

రోడ్ల గుంతల పూడ్చివేత



రోడ్ల మరమ్మతులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - యలమంచిలి : ఈనెల 15 నాటికి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని రోడ్ల గోతులు పూడ్చాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. గత ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసిన రోడ్లను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక కొలిక్కి తెచ్చే ప్రయత్నం మొదలైందని, గుంతలు పూడ్చే కార్యక్రమం దశల వారీగా చేపడుతున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ బి రోడ్లను ఆ సంస్థ ఆధ్వర్యంలో 10 పనులు , మున్సిపాలిటీ పరిధిలోని 15 పనులు ఈ నెల 15లోగా పూర్తిచేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలోని 15 పనులకు రూ.2.46 లక్షలు మంజూరు చేశామన్నారు. రోడ్ల మరమ్మతులకు ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఇలు మోకా నానాజీ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెర్లలో లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి- కశింకోట : పాడిపశువులకు ఆరోగ్యవంతమైన ఆడదూడలు పుట్టేందుకు ఇపుడు త్రిబులెస్స్ కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ రామమోహన్ అన్నారు గురువారం మండలంలోని అచ్చెర్ల గ్రామంలో పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో లేగ దూడలు ప్రదర్శన జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాడిరైతులు పశు పోషణపై దృష్టిపెట్టాలని, అవసరమైతే పశు వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆరోగ్యవంతమైన లేగదూడల ప్రదర్శనలో 75 లేగ దూడలు పాల్గొనగా, నందిని అప్పారావు, దొడ్డి రాము నాయుడు,బండారు నాయుడు, నిమ్మదల నాగేశ్వరావులకు చెందిన దూడలను ఉత్తమమైనవిగా గుర్తించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతల నైనముశెట్టి రమణారావు, దొడ్డి నాగేశ్వరరావు, నిమ్మదల సన్యాసినాయుడు, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ సౌజన్య, పశు వైద్యాధికారులు ఆల్ఫాన్స్ జార్జ్, సిహెచ్. చైతన్య మణి, దయానా పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని తానాం గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ



లేగదూడల ప్రదర్శన ప్రారంభిస్తున్న డాక్టర్ రామ్మోహన్

గోకుల మిషన్ సౌజన్యంతో ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం, పాడి రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న రైతులకు పాడి పోషణ, పశువ్యాధుల నివారణ, లింగ నిర్ధారిత వీర్యంపై అవగాహన కల్పించారు. పాడిపశువులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అవసరమైన మందులు అన్ని రైతులకు పంపిణీ చేయడం జరిగిఅందజేశారు. కార్యక్రమంలో వెటర్నరీ ఎడి డాక్టర్ కీర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ అశ్విని, డాక్టర్ సురేష్, డాక్టర్ శివ కుమార్, డాక్టర్ మౌళిక, పశువైద్య సిబ్బంది పాల్గొని 65 పశువులకు 22 లేడ దూడలకు నట్టల నివారణ మందులు అందించారు. మూడు పశువులకు

ల్యాబ్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ప్రజాశక్తి- మునగపాక: స్థానిక పిహెచ్‌సి ఆవరణలో నూతనంగా ల్యాబ్ నిర్మాణానికి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గురువారం స్థల పరిశీలన చేశారు ఆసుపత్రిలో ల్యాబ్ నిర్మాణానికి రూ. 50 లక్షల నిధులు మంజూరుకాగా, దాని ఏర్పాటుపై ఆసుపత్రి వైద్యులతో సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాలు సూచనలు తీసుకున్నారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని మరుగుదొడ్లు, ఆపరేషన్ థియేటర్, రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ విమలగిరి, ఆరోగ్య సిబ్బంది, జనసేన, టిడిపి మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, దొడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు దాడి ముసలి నాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, సూరిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి



మామిడిపాలెంలో మాట్లాడుతున్న మళ్ల సురేంద్ర

ప్రజాశక్తి -నక్కపల్లి:భూ సమస్యల పరిష్కారానికే రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసిల్దారు నరసింహమూర్తి తెలిపారు. మండలంలోని జానకయ్యపేట, సిహెచ్ లక్ష్మీపురం గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. అర్జీలను పరిశీలించి పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పట్టాలివ్వాలని వినతి

మాడుగుల :మండలంలో జాలంపల్లి పంచాయతీ పెద పిట్టగెడ్డ రెవెన్యూ పరిధిలో గిరిజనులు సాగు చేస్తున్న ఫారెస్ట్ భూములకు పట్టాలు ఇవ్వాలని గురువారం పెద పిట్టగెడ్డ గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ ఎస్.గణపతిరావుకి వినతి పత్రం అందజేశారు. ఈ అనంతరం అయన మాట్లాడుతూ, మండలంలోని పెదపిట్టగెడ్డ భూముల్లో పేదలు జీడీ మామిడి తోటలు వేసు కొని ఉపాధి పొందుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు భవాని తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల:రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ప్రత్యేక అధికారి, విద్యుత్ శాఖ సూపరెంటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్ అన్నారు. మండలంలో పాములవాక గ్రామంలో రెవెన్యూ సదస్సు కు హాజరైన ఆయన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై తహసిల్దార్ తిరుమల బాబును అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జనార్ధన్, విలేజ్ సర్వేయర్ శ్రీనివాస్, ఆర్ఐ వర్ధవరావు, టిడిపి నాయకులు భాస్కరరావు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని చోద్యంలో సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి.శ్రీనివాసరావు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భూసమస్యలపై దరఖాస్తు పెట్టుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చైనులు, మండల సర్వేయర్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఆదపురెడ్డి ప్రభాకర్, వీఆర్వో శ్రీనివాసరావు, టీడీపీ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు అడిగర్ల స్వామినాయుడు, దేవాడ శేషు, మాకిరెడ్డి చెన్నారెడ్డి, లగుడు వెంకటరమణ పాల్గొన్నారు. గాదంపాలెంలో కూడా రెవెన్యూ సదస్సును నిర్వహించడం జరిగింది.


అనకాపల్లి : భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర అన్నారు. అనకాపల్లి మండలం మామిడిపాలెం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. గత ప్రభుత్వం సృష్టించిన భూసమస్యల నుంచి రైతులను విముక్తులను చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచన మేరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. తహశీల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ రమేష్, కూటమి పార్టీ నాయకులు పూడి పరదేశి నాయుడు, చెక్కల శ్రీను, సైనిక్ నాయుడు పాల్గొన్నారు.

వడ్డాది : . సమస్యలు పరిష్కారం కాని రెవెన్యూ సదస్సులు ఎందుకని వడ్డాదిలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వడ్డాదిలో తహసీల్దార్ ఎం.లక్ష్మీ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులో తమ జిరాయితీ భూములు ఇనాం భూముల జాబితాలో చేర్చి ఇన్నాళ్లుగా ఇబ్బందులకు గురిచేసిన అధికారులు, పలుమార్లు విన్నవించినా సమస్యల పరిష్కరించలేదని మండిపడ్డారు. ౯. మొల్లేటి వెంకట రమణమ్మ అనే మహిళ తన 30 సెంట్ల భూమిని స్థానిక రైతు బొబ్బరి రమణ అన్యాక్రాంతం చేశారని ఫిర్యాదు చేశారు.తహసిల్దార్ లక్ష్మీ మాట్లాడుతూ ఇనాం భూముల జాబితా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. కూటమి నేతలు దొండా నరేష్,అడపా నరసింహమూర్తి, వైసీపీ నేత దొండా నారాయణమూర్తి, విఆర్ఓ సుధాకర్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని రాయపుర అగ్రహారం రెవిన్యూ సదస్సులో భూ సమస్యలపై 5 అర్జీలు అందినట్లు తహసీల్దార్ బి.చిన్నకృష్ణ తెలిపారు. రెవెన్యూ సమస్యలపై 4,సరిహద్దులు సర్వే చేయాలని ఒకటి అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు,ఆర్. ఐ వీరయ్య, రీ సర్వే డిటి గణపతి రావు, రిజిస్టర్ ఆఫీస్ సిబ్బంది జయలక్ష్మి వీఆర్వోలు ఎస్. కామరాజు ,ఎస్.రవి ,బి.ఈశ్వరరావు, గ్రామ సర్వేయర్లు రవితేజ, శ్రీను పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని టి. శిరసపల్లి గ్రామంలో సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ఆదిమహేశ్వరరావు పాల్గొని, 50 అర్జీలు స్వీకరించారు.. కార్యక్రమంలో ఎంపీటీసీ మద్దాల వీర్ నాయుడు, డి టి శేష్ కుమార్పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి చంద్రనగర్లో రెవెన్యూ సదస్సును పశ్చిమనియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసం పెట్టిన ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.రమేష్, జోనల్ కమిషనర్ హేమావతి, స్టీల్ప్లాంట్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్.సునీత సబ్రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాడుగులలో వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఒ

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో సత్యవరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ధాన్యానికి కనీస మద్దతు ధర గ్రేడ్ – ఎ రకానికి క్వింటాకి రూ.2320, సాధారణ రకం క్వింటాకి రూ. 2300 ప్రకటించారని తెలిపారు. రైతులు ఆధార్ కార్డ్, ధాన్యం నమునా తీసుకొని దగ్గరలో వున్న రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి (రామరావు), ఎంపీటీసీ సభ్యులు తలారి అప్పారావు, ఉప సర్పంచ్ వమ్మలి పెంటయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఆగంతకులు చేసే ఫోన్లకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర సూచించారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలియజేస్తూ 7569778380 ఫోన్ నెంబరుతో గాని, ఇతర ఫోన్ నెంబరుతో గాని కొంత మందికి ఫోనులు చేస్తూ, మీరు అర్జెంటుగా వ్యాపార లైసెన్స్, రెన్యూవల్ లైసెన్సు, ఇతర టాక్స్ కట్టాలని చెప్పి బెదిరిస్తున్నారన్నారు. ట్రూ కాలరులో కూడా మునిసిపల్ కమిషనర్ అని కూడా వస్తుందన్నారు. అటువంటి ఫోన్ కాల్సుకు రెస్పాండ్ అవ్వద్దని, ఫోన్ పే ద్వారా గాని ఇతర మార్గాల ద్వారా కట్టవద్దని సూచించారు. మునిసిపాలిటీకి కట్టవలసిన బకాయిలు వుంటే, స్వయంగా ఆఫీసులో చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు.

హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి-గొలుగొండ:ద్విచక్ర వాహనదారులు తప్పనిరిగా హెల్మెట్ ధరించాలని కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు సూచించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటిం చాలన్నారు.వీటిపై వాహన దారులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.





ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న కరస్పాండెంట్

శ్లోకాల పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :గీత జయంతి సందర్భంగా స్థానిక బంగార్రాజు థియేటర్ వద్ద శ్రీ భవిష్య ప్రైవేటు పాఠశాల విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. కరస్పాండెంట్ వి వెంకట విజయ కుమారి నేతృత్వంలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలలో శ్రీ భవిష్య పాఠశాల విద్యార్థులు విజయం సాధించారన్నారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ సతీమణి డాక్టర్ సువర్ణ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జాలముర్రి బంగారు రాజు , జాలముర్రి జోగారావు, జాలముడి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి -రావికమతం:మండల కేంద్రంలోని శిరిడి సాయిబాబా ఆలయం వద్ద అన్న సమారాధనను గురువారం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ శిరిడి సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు.

హెటిరో సహకారంతో.. డ్రెయినేజీ నిర్మాణాలకు శంకుస్థాపన



మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిదులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని సిహెచ్ లక్ష్మీపురం గ్రామంలో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఆర్థిక సహాయంతో డ్రైనేజీ నిర్మాణ పనులకు గురువారం కంపెనీ ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. సిహెచ్ లక్ష్మీపురం గ్రామంలో హెటిరో కంపెనీ యాజమాన్యం 15 లక్షల నిధులతో 270 మీటర్లు పొడవు గల డ్రైనేజీ నిర్మాణం కు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు యస్. కుల్లా రెడ్డి, ఎమ్.సుబ్బారెడ్డి, యన్.రాజారెడ్డి, ఎంఎన్ వీర వెంకట సత్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామ పెద్దలు, ప్రజల విజ్ఞప్తి మేరకు కంపెనీ నిధులతో డ్రైనేజీ మంజూరు చేసినట్లు తెలిపారు. హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ బండి పార్థసారధి రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్టీ ప్రతినిధి సిహెచ్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు కర్రి అప్పారావు, సత్యనారాయణ, బుజ్జి పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్లకు, అధికారులకు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, ఈ రెండు రోజులు జరిగే శిక్షణా తరగతులను వినియోగించుకోవాలన్నారు. ఎంపిడిఒ సూర్యనాగేశ్వరరావు మాట్లాడుతూ, సమగ్ర అభివృద్ధిపై సామాజిక న్యాయం, సామాజిక భద్రతపై రెండు రోజులు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. జలజీవన్, జాతీయ గ్రామీణ తాగునీరు, స్వచ్ఛభారత్ మిషన్, మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులు వంటి విషయాలను తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు, సచివాలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి



వాయిదాను ప్రకటిస్తున్న ఎంపిపి

సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి-గొలుగొండ:సభ్యుల కోరం సరిపోక పోవడంతో మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన జరగాల్సిన ఈ సమావేశానికి 15 మంది ఎంపిటిసిలు హాజరు కావలసి ఉండగా కేవలం నలుగురు మాత్రమే హాజరు కావడంతో సమావేశం వాయిదా వేశారు. ఈ సమావేశంలో పాల్గొనడానికి అన్ని శాఖల అధికారులు, జెడ్పిటిసి గిరిబాబు హాజరైనప్పటికీ కోరం లేకపోవడంతో సమావేశం నిరవధికంగా వాయిదా పడింది.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని అమ్మపేట గ్రామంలో కొత్తమల్లంపేట విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది గురువారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీహెచ్ఓ బిజెవి.ప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్పీ ఎంబి.షకినా, ఎంపిహెచ్ఏఎఫ్ సిహెచ్.సత్యవేణి, ఆశ కార్యకర్తలు సి.కుమారి, ఎం.కుమారి, కె.కృపావతి పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్ డిఒ రమణ

పునరావాసంపై ఆర్‌డిఒ చర్చలు

ప్రజాశక్తి- నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు మండలంలోని పెదబోదిగల్లం లో పునరావాసం కల్పించేందుకు నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయంలో గురువారం నర్సీపట్నం ఆర్ డి ఓ వివి రమణ చర్చలు జరిపారు. వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నక్కపల్లి మండలంలో వేంపాడు, డిఎల్ పురం, చందనాడ, రాజయ్యపేట, అమలాపురం రెవెన్యూ పరిధిలో సుమారుగా 5 వేల ఎకరాలు భూములను ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా సేకరించింది. పాటిమీద, మూలపర్ర, బుచ్చిరాజుపేట, చందనాడ, తమ్మయ్యపేట తుమ్మలపేట తదితర గ్రామాల్లో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కొంత భాగంలో ఇల్లులు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. పరిశ్రమల ఏర్పాటు కొరకు ఆ ఇల్లులు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు వారందరికీ పునరావాసం కల్పించేందుకుగాను అధికారులు నక్కపల్లి మండలంలోని పెదబోదిగల్లం గ్రామంలో స్థలాన్ని గుర్తించారు. ఈ మేరకు ఆర్ డి ఓ రమణ భూములకు సంబంధించిన రైతులతో చర్చలను ప్రారంభించారు. భూములకు సంబంధించిన నష్టపరిహారం తదితర అంశాలపై రైతులతో చర్చించారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్

న్యాయంపూడి పంచాయతీకి జాతీయ అవార్డు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని న్యాయంపూడి పంచాయతీకి ఢిల్లీలో జాతీయ అవార్డు ప్రధానం చేశారు. దీన్ దయాల్ ఉపదయా పంచాయితీ సతత్ వికాస్ పురస్కార్ కింద సమృద్ధి నీటి సరఫరా విభాగంలో జాతీయస్థాయిలో న్యాయంపూడి పంచాయతీ మొదటి స్థానంలో ఎంపికయింది. ఈ మేరకు దేశ రాజధాని ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో బుధవారం జరిగిన అవార్డు ప్రధానోత్సవం కార్యక్రమంలో న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలుబాబు కు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము జాతీయ అవార్డును ప్రధానం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణి, డిఎల్‌పిఓ మూర్తి, ఎంపీడీవో డి సీతారామరాజు, ఇన్చార్జి ఈఓపిఆర్ డిఎం శ్రీను, పంచాయతీ కార్యదర్శులు నరసింహారాజు, నరసింగరావు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎఐ పాఠ్యాంశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిజిటల్ భవిష్యత్తు కోసం విద్యార్థులను సిద్ధం చేయడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలల్లో ఏడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు పాఠ్యాంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ప్రవేశ పెట్టనున్నారని శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. గురువారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి వివరించారు. ఇది విద్యార్థులలో సానుకూల ప్రభావాన్ని నెలకొల్పుతుందన్నారు. కార్యక్రమంలో క్వెస్ట్ అలయన్స్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీడ్ సమీరా పాల్గొన్నారు.

బుద్ధ ధ్యాన మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రైల్వే న్యూ కాలనీ రెసిడెన్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుద్ధ ధ్యాన మందిరాన్ని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కెఎమ్ హైస్కూల్ ప్రాంగణంలో గురువారం ప్రారంభించారు. బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, కూటమి సీనియర్ నాయకులు అక్కిరెడ్డి జగదీష్, రమణారావు, నాగమణి, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ -అన్నదాతకు అండగా వైసిపి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక వైయస్సార్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించే అన్నదాతకు అండగా పోస్టర్ ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎన్నో హామీలు ఇచ్చి చంద్రబాబునాయుడు దగా చేశారని ఆరోపించారు. రైతు వ్యతిరేక విధానాలను కూటమి ప్రభుత్వం అనుసరిస్తుందని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2014 ఎన్నికల్లో రైతుల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి అదికారంలోకి వచ్చారని, ఆ హామీ విస్మరించారన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మాజీ సిఎం జగన్ అర్హులైన ప్రతీ రైతుకు రూ.13500 ఇచ్చారని గుర్తు చేశారు.2024 ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.20వేలు ఇస్తానని చెప్పిన చంద్రబాబు అమలు చేయలేదన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, సీనియర్ నేత రుత్తల యర్రాపాత్రుడు(బాబులు), గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, గొలుగొండ ఎంపిపి గజ్జలపు మణికుమారి, నర్సీపట్నం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మాకవరపాలెం మండల నాయకులు రుత్తల సర్వేశ్వరరావు, బయపురెడ్డి గణమ్మ, మాకిరెడ్డి రామకష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

రావికమతం: కూటమి ప్రభుత్వం రైతులకు తీరని చేసిందని, అందుకే అన్నదాతలకు అండగా నిలవాల్సిన అవసరం ఏర్పడిందని వైఎస్ఆర్ సిపి మండల పార్టీ అధ్యక్షులు మహాలక్ష్మి నాయుడు అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వానికి కనువిప్పు కల్గించడమే లక్ష్యంగా ఈ నెల 13న ఉదయం అనకాపల్లి రైల్వే స్టేషన్ సమీపాన ఉన్న వైఎస్ఆర్సిపి కార్యాలయం నుంచి ర్యాలీగా తరలి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు.వైఎస్ఆర్ సిపి హయాంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు... రైతుకు వెన్నుదన్నుగా జగన్ ప్రభుత్వం నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కంచిపాటి జగ్గారావు, మాజీ డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ 12వ వార్డు పరిధిలో నిత్యావసర సరుకులను సమగ్ర రైతు సహకార సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి మున్సిపల్ కౌన్సిలర్ పద్మావతి హాజరయ్యారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు రిబ్బన్ కట్ చేసి ఇఫ్కో సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సమగ్ర రైతు సహకార సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ల కోసం 1 లక్ష విరాళాన్ని స్పీకర్ కు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, మహిళల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని, ఏ కార్యక్రమమైనా పూర్తిగా పారదర్శకతతో నిర్వహించాలన్నారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంప సురేంద్ర, అనకాపల్లి జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం. వెంకట్, కౌన్సిలర్ రాజుల నాయుడు, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ సూర్యచంద్ర, మండల ఎగ్జిక్యూటివ్ బోడ్డు సభ్యులు శివ, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల్లో ఆయకట్టు రైతులకు సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహించేందుకు జల వనరులు, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఎన్నికలు వాయిదా పడిన నేపథ్యంలో బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ వెలవడంతో ఈనెల 14న ఎన్నికల నిర్వహించేందుకు అధికారులకు సిద్ధమయ్యారు. మండలంలో ఏడు చిన్న నీటి తరహా నీటి సంఘాలు ఉండగా రైతులు1885 మంది ఉన్నారు. మేజర్ ఛానల్ తాండవ కు సంబంధించి 6ఛానల్ లో1715 మంది రైతులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మైనర్ కు 6గురు సభ్యులను, మేజర్ కు 12 మంది సభ్యులను ఎంపిక చేసుకొని ఒకరిని అధ్యక్షునిగా ఎన్నుకుంటారు. ఉదయం నామినేషన్ల స్వీకరణ అనంతరం ఒంటిగంటకు అధ్యక్షుల ఎన్నిక జరుపుతామని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ఎన్నికలు జరగనుండడంతో గ్రామీణ ప్రాంతాలలో సాగునీటి వ్యవస్థకు పూర్వవైభ్యం వస్తుందని చర్చించు కుంటున్నారు.

కోటవురట్ల: ఈనెల 14న మాకవరపాలెం మండలంలో పది చిన్న తరహా నీటి కాలువల అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణపాత్రుడు తెలిపారు. మండలంలో 10 నీటి సంఘాలు ఉన్నాయని, మల్లవరం ,బయ్యవరం, బూరుగుపాలెం, మాకవరపాలెం, జాజిగడ్డ పాపయ్యపాలెం, తూటిపాల, పెద్ద చెరువు, పైడిపాల, వజ్రగడ, కోడూరు, చానళ్లకు అధ్యక్ష ఉపాధ్యక్షులు, ఎన్నికలు జరపనున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఇప్పటికే అధికారులు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రశాం తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

సార్బ్‌ను సందర్శించిన డిజిఎం కెజి.రావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిరిపురంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సార్బ్ (స్టెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచ్)ని హైదరాబాద్ సామ్రో (స్ట్రెస్స్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ రీజనల్ ఆఫీసు) డిప్యూటీ జనరల్ మేనేజర్ కెజి.రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్షిక సంవత్సరం రికవరీలో ఈ బ్రాంచ్ అద్భుత ప్రతిభ కనబరిచిందని, భవిష్యత్తులో కూడా అత్యధిక రికవరీలు సాధించాలని బ్రాంచి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బ్రాంచి హెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎమ్.విజయలక్ష్మి సిబ్బందిని అభినందించారు. అనంతరం బ్రాంచి ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సార్బ్ విశాఖపట్నం ఎజిఎం ఎమ్.విజయలక్ష్మి, చీఫ్ మేనేజర్లు బి.వరప్రసాద్, వై.శ్రీకాంత్, వై.కిరణ్ చంద్, ఇతర బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న డిజిఎం కెజి.రావు

ప్రముఖ వ్యాపారవేత్త విజయకుమార్ మృతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 8వ వార్డు సాగర్‌నగర్ శాటిలైట్ సిటీ ఏర్పాటులో కీలకపాత్ర వహించిన ప్రముఖ వ్యాపారవేత్త డి.విజయకుమార్ గురువారం మృతి చెందారు. కొంత కాలంగా ఆయన లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇటీవలే చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ



ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి అక్కడ వైద్యం పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1990లో సాగర్‌నగర్ శాటిలైట్ సిటీ నిర్మాణంలో విజయకుమార్ కీలక పాత్ర పోషించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఆయన వ్యాపార రీత్యా విశాఖపట్నం వచ్చి సాగర్‌నగర్‌లో స్థిరపడ్డారు. తర్వాత పలు పరిశ్రమల్లో ఎ 1 కాంట్రాక్టర్‌గా తన వ్యాపారాన్ని ప్రారంభించారు. శాటిలైట్ కాలనీ ఏర్పడని మొదటిలో సాగర్‌నగర్ ద వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీకి తొలి కార్యదర్శిగా వ్యవహరించారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో కాలనీకి 24/7 గంటలు నిరంతర మంచినీటి పథకాన్ని తీసుకురావడంతో కీలక పాత్ర పోషించారు. అందరితో కలివిడిగా ఉండే మనిషిగా విజయ్‌కుమార్‌కు పేరు. కొద్దికాలంగా వ్యాపార రీత్యా కూర్మన్నపాలెంలో కుటుంబంతో సహా ఆయన నివాసముంటున్నారు. ఆయన మృతికి సాగర్‌నగర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీవత్సవాయి శ్రీరామవర్మ, బోడేపూడి దొరబాబు, కాలనీపెద్దలు, సాగరేశ్వరస్వామి ఆలయ సముదాయ కమిటీ సభ్యులు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

శ్రీ కనకమహాలక్ష్మి ఆలయం కిటకిట

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వన్ టౌన్ బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా రెండో గురువారం వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో అమ్మవారి ఆలయ ప్రాంతం కిక్కిరిసింది. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పద్మజ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యూలైన్‌లో ఉన్న భక్తులకు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి శోభారాణి పాల్గొన్నారు.

ప్రకృతి రక్షణకు కొత్త చట్టాలు అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రకృతిని కాపాడటానికి ప్రభుత్వాలు కొత్త చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంఘమిత్ర సోషల్ సర్వీస్ నిర్వాహకులు సూరిబాబు అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మూడు రోజులు పాటు వివిధ సామాజిక అంశాలపై నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం మొదటి రోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎండిన భూములను పచ్చదనంగా మార్చాలనేదే తన ప్రయత్నమన్నారు.

ఆలయానికి గంట వితరణ

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో ఎం.కోడూరు గ్రామంలో మోదకొండమ్మ అమ్మవారి ఆలయానికి సుమారు 9 కేజీల గంటను గోల్లి అప్పలకొండ కుమారులు ఏసుబాబు, సత్తిబాబు, శివాజీలు గురువారం అందజేశారు.ఆలయ కమిటీ చైర్మన్, ఎం కోడూరు గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ, పడాల అప్పల నాయుడు, కలిమి గోసన్న, కన్నా పాల్గొన్నారు.